# గాడిదలు

జీవిత పరిణామంలో అడుగడుక్కీ ఏర్పడిన తీవ్ర సంఘటనలలో, సంఘర్షణలలో, సహజంగా జీవించి వుండటానికి తీర్మానించుకున్న అనేక జంతుజాలాల ఆశయాలూ, ప్రయత్నాలూ అడుగంటిపోయాయి. అనేక మహామహా జాతులు తమ గుబారావాంఛలను తీర్చుకోలేక, తమ అసాధారణ శరీరాలను పోషించుకోలేక, అంతరించి పోయాయి. పరిసర ప్రాంతాల ధాటీకి తట్టుకోలేక అనేక జంతుజాలాలు ప్రకృతి సిద్ధమైన వునికినీ, ధైర్యస్థయిర్యాలనూ, నైజాలనూ, విడిచిపెట్టి, గుడ్డకట్టుకుని మురికిని దాచుకోవడం నేర్చుకున్న మానవుడికి మల్లేనూ, పప్పుకూడు తినడం మరిగిన కుక్కకు మల్లేనూ, కృత్రిమ వాతావరణంలో కృత్రిమ జీవనాలను సాగిస్తున్నై. కాని, గాడిదల కథమాత్రం వేరుగా కనిపిస్తుంది.

* * *

భగవంతుడికి మల్లేనే గాడిదలకు కూడా ఆదిమధ్యాంతాలు లేవు. ఈ జాతి ప్రారంభంలో యెలావుండేదో ఇప్పుడు కూడా అలాగే - ఆదిలో ప్రకృతి ప్రసాదించినపరిశుభ్రతతో-కాలమానపరిస్థితులనూ, అవి తీసుకు వచ్చేమార్పులనూధిక్కరించిబ్రతుకుతూంది. గాడిదలుప్రపంచంలో అన్ని మూలలా వ్యాపించి వున్నాయి. కాని, మిగతా జాతులలోకి మల్లే-ముఖ్యంగా మానవజాతికి మల్లే-వీటి జనాభాలో ఏవిధమైన అతివృష్టి, అనావృష్టి దోషాలూ లేవు. మానవులు కొన్నికొన్నిచోట్ల కోట్లకొద్దీ వున్నారు. కొన్నికొన్నిచోట్ల-నేడు అమెరికాలోని రెడ్ ఇండియన్లకు మల్లే-బహు స్వల్పంగానే వున్నారు. గాడిదలట్లుకాకుండా, అవి వుండే ప్రదేశాల్లో, సగటున మైలుకు ఏ ఒక్కటో-టిబెట్టుదేశంలోని లామాలకు మల్లే-వుంటున్నాయి. ఈ ఒక్కవిషయమే చాలు, యీ జాతియొక్క ఆరోగ్యాన్నీ, అనుసరణీయమైన ఆదర్శాన్నీ తెలుసుకుందుకు.

ఈ విషయాన్ని గురించి నేను చాలా కాలంనుంచి పరిశోధనలు చేస్తున్నా చివరకు నాకు తోచిందేమంటే ఏజాతియైనా సరే విరగ

చాటులో కూలిపోకుండానూ, బేవారస్తై నీళ్ళు కారిపోకుండానూ వుండాలంటే గాడిదల చిత్తప్రవృత్తి అలవరుచుకోవాలి—.

* * *

గాడిద జీవితంలో నాకు ముఖ్యంగా కనిపించింది బుద్ధభగవానుడు బోధించిన 'మితం' అనే ఆదర్శం. ఈ ఆదర్శాన్ని అనుసరించేవారు మనలో ఎందరున్నారు? జపానువారు బౌద్ధులు. వారిలో కనిపించే 'మితం' ఏమిటి? ఈ రోజున జపాను పారిశ్రామిక విధానాలను తెలివితేటలుగా కాపీచేసి, ప్రతి సరుకుయొక్క ఉత్పత్తిని తనకు కావలసినవానికంటే ఎన్నోరెట్లు వృద్ధిచేసి, ఇతరదేశపు మార్కెట్లను పట్టుకుందుకోసమై అమెరికా, ఇంగ్లండు, జర్మనీలను మల్లే సామ్రాజ్య విస్తీర్ణం చేసుకుంటూంది. కాగా, యుద్ధం అనే మితిమీరిన కార్యక్రమాన్ని అత్యవసరంగా అమలు జరపవలసివచ్చింది. పోతే, చైనా విషయం చూడండి, చైనాలోకూడా బౌద్ధమతమే. కాని, చీనావాళ్ళంతా ఇన్నాళ్ళనుంచీ మితిమీరి నల్లమందు మింగి కూచోవడం మూలానే ఈ రోజున వాళ్లు తమగడ్డి తాము కరుచుకుంటున్నారు. సయాం మొదలైన బౌద్ధమత ప్రచారంగల యితర ప్రదేశాల పరిస్థితిగూడా అంతే.

* * *

కాని, గాడిదలు ఏ బౌద్ధమత సిద్ధాంతాలూ అభ్యసించకుండానే 'మితం' అనే సిద్ధాంతాన్ని తమ జీవితలక్ష్యంగా పెట్టుకున్నాయి. గాడిదలు ఏమి తింటాయో ఎవరైనా చూశారా? సాధారణంగా గడ్డి, గాదం తిని బ్రతుకుతాయని మన మనుకుంటాము. ఆవులకు, గేదెలకు యజమాన్లు పెట్టినట్టుగా చాకలివాడు కూడా తను పెంచేగాడిదకు ఏదో మేత వేస్తాడని అనుకునేవారు మనలో లేకపోలేదు. కాని, ఇది సత్యదూరం. చాకలివాడు తన గాడిదలకు వేసేది దెబ్బలే - మేతకాదు. పోతే, అవి కాస్త విశ్రాంతి లభించినప్పుడు ఏ ఆకో, అలమో, చిత్తుకాయితాలో తింటాయి. బ్రతికివుండటానికి ఏదైతే ఏమిటనేది వాటి

ఆశయం. తిండి ప్రథమకర్తవ్యంగా పెట్టుకోనిదల్లా ఒక్క గాడిదజాతే. అట్లాఅని అవి బక్కచిక్కిపోవడం గాని, ఆజాతి త్వరగా నశించిపోవడంగాని జరుగుతూందా? లేదు, లేదని ఘంటాపథంగా చెబుతాను.

ప్రపంచంలో వుంటూ గూడా ప్రపంచంతో ఏ విధమైన సంపర్కమూ, బాదరాయణ సంబంధమూ పెట్టుకోవడం ఇష్టంలేనిజాతి ఒక్క గాడిదజాతే. ప్రపంచమంటే - మోసం, అనారోగ్యం, దౌర్భాగ్యం, ఈర్ష్య, కృత్రిమ వాతావరణం-వీటితో గూడిన ప్రపంచమంటే గాడిదలు చాలా విముఖత చెంది జార్జి బెర్నార్డుషాకు మల్లే తమ చేష్టలలోనూ, చిత్తప్రవృత్తులలోనూ గొప్ప నిస్పృహను వెల్లడిచేస్తాయి. ఈనిస్పృహను మనం సరిగా అర్థంచేసుకోలేక గాడిదలబ్రతుకు మొండిబ్రతుకని దూషిస్తాము. బెర్నార్డుషా నాటకాలను చదివి 'అతడి లివరు చెడిపోయింది. అంచేతే ఇలాంటి నాటకాలు రాశాడు' అని వ్యాఖ్యానించిన ఒకానొకఅమెరికన్ విజ్ఞానవేత్తకు మల్లే! చాకలివాడైతే, దొంగ వస్తే కుక్కకుమల్లే మొరిగి తనను లేపలేదని బడితతో చావమోదుతాడు గాడిదను. ప్రతి వ్యక్తినీ అనుమానించడం వాడు దొంగ అనుకుని యజమానిని లేపబోవడం, పట్టెడు మెతుకులు పెట్టాడుగదా అని ప్రతి నిముషం యజమానిడికి ఏవిధంగా కృతజ్ఞత చూపడమా అనే ఆలోచనలో కార్యక్రమంలో పడిపోయి జీవిత పరమావధిని తెలుసుకోలేకపోవడం - యిలాంటి కుక్కబుద్ధులు గాడిదలకు లేవు. గాడిదలు గాడిదలే - కుక్కలెట్లా అవుతాయి.

వీరిద్దరికీ మధ్య నేడు కనిపించే సంబంధానికి తగినంత కారణం నాకు కనబడలేదు. ఏ యుగంలోనో ఇది ప్రమాదవశాత్తూ ఏర్పడి వుంటుంది. కుక్కకు మల్లే ఇళ్ళలో జొరబడి అవీ ఇవీ తినేద్దాం అనే తరహాకు చెందినవి కాకపోవడం, గుర్రాలకు మల్లే స్వారికి ఉపయోగకరం కాకపోవడం-యిత్యాది లక్షణాలు గాడిదలలో వుండటం ఏ పూర్వకాలపు చాకలో చూసివుంటాడు. ఇంతే గాకుండా గాడిదల మెత్తదనం, తిరుగుబాటు లేనితనం యివన్నీ కూడా అతడి-ఆ చాకలి

దృష్టిని ఆకర్షించి వుంటాయి. ఆపళాన కనపడ్డ గాడిదనల్లా ఇంటికి తోలుకెళ్ళి దానిచేత కుళ్లుగుడ్డలమూటలు మోయించడం మొదలు పెట్టి వుంటాడు. గాడిదతరహా, కష్టసుఖాలంటే దానికి గల విముఖత ఇదివరకే మాటాడుకొనివున్నాం. ఈలక్షణాలు దానివద్ద వుండటంచేత అది కిమ్మనకుండా మూటలు మోసేస్తూంది, మోయకపోతే వొలికిందేమిటి మోస్తే వొలక్కపోయిందేమిటి అనేది దానిభావం కాని ఏరోజు నేనాచాకలివాడు ఒకటి రెండు దాని వీపుమీద వేశాడా అంటే- అది సాగిన నరాలుగల ఫ్యాక్టరీ కూలీకి మల్లే విప్లవం, తీసుకురాదు- సత్యాగ్రహంచేసి నించున్నచోటనుంచి అంగుళం ముందరికి వెళ్ళదు. అంతే! ఇంకా గట్టిగా కోపంవస్తే వెనక కాలితో ఒక్కటే యిచ్చి వూరుకుంటుంది. ఇంతకుమించి ఏ విప్లవ బుద్ధీ, ఏ దౌర్జన్యకార్యక్రమమూ దీనిలో కనిపించదు. కాగా చాకలివాడు గాడిదను తన దానినిగా చేసుకున్నాడు - చేసుకోగలిగాడు.

తెలతెల్లవారుతూంటే ఏ ఒక్కరోజునైనా మీరు తలుపులు తీసి చూడండి. ఎదురుగా రోడ్డుమీద ఉదయకాలపు సంధ్యారాగంలో, ప్రకృతిని ఆరాధిస్తూ రెండు స్వరూపాలు నిలబడి వుంటాయి. అవి మీ యింటికి రాలేదు. మీ ఇంట్లోజొరబడి మీ పవిత్రతనూ, శీలాన్ని భంగపరిచే ఉద్దేశం వాటికిలేదు కాని, వాటికివుంటే బుద్ధి మీకు లేక, ఆ ఉదయకాలపు శోభనదేవతలను మీరు మీ పరిసరాలనుండి తరుముతారు. మీ పిల్లలు వాటిమీద రాళ్లు రువ్వుతారు. వాటి తోకలకు చీపురుకట్టలు కడతారు. దీనికి కారణం అవి గాడిదలు, అయిఉండటమేనని మీరు మనుషులు చెబుతారు. ఈ పాటి మీరిద్దరూ ఒకరిపేరు ఒకరు మార్చుకోవడం ఉచితంగా వుంటుంది.